# ఒరేయ్ వెంకటచలం

నేను రైలుపెట్టె యెక్కీ యెక్కడంతో ఓ మూలనించి, 'ఒరేయ్' అని కేక వినపడ్డది.

నన్ను ఒరేయ్ అని పిలిచే వాళ్ళిద్దరే వున్నారు లోకంలో. వాళ్ళు నాకు ప్రేమాస్పదులైనందువల్ల సంతోషంతో తలెత్తి చూశాను. నాకేసి పరమానందంతో చూస్తున్నాడు. తెలిసినవాడు దొరికాడు కదా అన్నట్టు. ఆయనెవరో నాకు తెలీదు, నన్నేనా అని అనుమానపడుతున్నాడు.

'ఇట్లారా, చోటుంది యిక్కడ' అంటున్నాడు పైగా.

ఇన్నేళ్లూ నన్ను వెలేసిన బంధువుడెవరన్నా దూరదేశంలో చూచిన ప్రేమ చేత పలకరిస్తున్నాడా యేం? అనుకుని వెళ్ళాను. ఒక ట్రంకుని బల్లమీద నించితీసి, ఓ గుజరాతివాణ్ణి మనిషికి కావలసినంత స్థలమే ఆక్రమించుకునేటట్టు తోసి నాకు చోటు చేశాడు.

'అట్లా చూస్తావేం? నన్నెరుగవూ?'

రైలెక్కగానే బంధువుడు దొరికిన నా అదృష్టానికి గావును, అందరూ నా వంక చూస్తున్నారు. లోకంలోకల్లా నాకు యిబ్బందైన విషయం రైలు పెట్టెలో అందరూ నావంక చూడడం.

ఈయన్ని 'నువ్వు' అనాలో 'మీరు' అనాలో తెలీదు. ఇంత పెద్ద రైల్లో యీ పెట్టె నాకు ఎట్లా తటస్థపడ్డది?

'ఎరక్కేం?' అన్నా.

'ఐతే నే నెవరు ?'

నా మీద అంత నమ్మకం లేకపోతే, నన్ను పిలిచి పక్కన కూచో పెట్టుకోమన్న దెవరు?-

ఏం చెయ్యను ?

'మరిచిపోయినాను'

'నిజం చెప్పు'

అసలు యెరగనేమో ?

'తెలీదు'

'ఈ డాబులకేం లే! నువ్వు నన్నెరక్కేం ?'

'ఐతే జ్ఞాపకం రావటంలేదు'

పెట్టెంతా అదిరేట్టు నవ్వాడు.

'నన్నెరుగవు నిన్ను నే నెరుగుదును'

'ఎవరో చెప్పు అని ప్రశ్న వేస్తానేమోననే ఆశతో ఆగాడు. నేను కొత్తచెప్పు కాల్ని కరిచినచోట చూసుకుంటున్నాను.

'నువ్వెవరో చెప్పనా?'

చూస్తున్నాను. మతి సరిగా వుందా యీయనకి? అని. వొద్దని యెట్లా అనను?

'నువ్వు వెంకటచలం'

'కాదండీ, నేను సూర్యనారాయణని.'

'డాబులు కొయ్యకు. నువ్వు వెంకటచలం.'

'ఏ వెంటకచలం.'

'ఇంకెవడు ? కథలు వ్రాసే వెంకటచలం.'

'కాదండి ఆయన్ని నేనెరుగుదును'

'ఈ మాటలకేంలే? నన్ను నువ్వెరగవా?'

నన్ను ఎగాదిగా చూశాడు.

'ఒరే, యేమిట్రా ఆ కథలూ నువ్వూనూ'

'నాకు తెలీదండి ఆ కథల సంగతి.'

'ఆ సంగతి సరేలే.......జరిగాయే అనుకో జరిగినంత మాత్రాన వ్రాయాలా? తప్పుకాదూ? భోజనం చేశామనుకో, తరవాత సంగతి కూడా వ్రాసుకుంటారా?'

'నన్నడుగుతారేమిటి ?'

'ఆ సంగతి సరేలే, వ్రాశావనుకో, యేమంటావు?"

"ఆర్టు సరేలే. వ్రాయవొద్దనలేదు. జరిగినవి వ్రాయడం ఎందుకు ?'

చూస్తున్నాను అర్థంగాక.

'పాపం, వాళ్ళ మనసులు నొచ్చుకుంటాయా లేదా ?' అన్నాడు, నిట్టూర్పు విడిచి.

'ఎవరి మనసులు ?'

'ఆ ఆడపిల్లలవి.'

'ఏ ఆడపిల్లలవి ?'

విసుక్కున్నాడు.

కొడతాడనకున్నాను.

'అదేరా, ఏదో నిన్ను నమ్మివొచ్చారనుకో. వొస్తే ? బట్టబయలు చెయ్యాలా ?'

'ఆడపిల్ల లెవరు ? నన్ను యిష్టపడి రావడమేమిటి ?'

అంత అదృష్టమా అనుకున్నాను, స్వగతంలో.

'తెలుసులేరా?' నీలో యేంచూసి వొచ్చారో?' అనుకున్నాడు నన్ను బాగా పరిక్షిస్తో.

'ఎవరూ రాలేదు. రారు.'

'మరి వొప్పుకుంటాననుకున్నావా! నాకు తెలుసులేరా?'

'బాగానే వ్రాశావుగాని, నువ్వు వ్రాసినవి ఒక లెఖ్ఖా జమా ! ఈనాడు అసలు రొమాన్సు అనేది వుందా ! ఒరే, యిప్పుడున్నదల్లా రొమాన్సు కావాలనే ఆశవల్ల పుట్టిన జాడ్యం. అంతేకాని చూడూ, ఈ కొత్త ఆడపిల్లలు-ఎవరి వెంటపడుతున్నారంటావు ? ఈ కొత్త కాలేజి కుర్రాళ్ళవెంట, కవిత్వాలూ, కథలూ వ్రాసే కుర్రకుంకలవెంట. వొరే! కథ చివరిదాకా వ్రాసేందుకు కలం పట్టుకునే బలంలేదే, వీళ్ళకి ! కథలు వ్రాసినవాడు కథలోమల్లే చెయ్యగలడనే యీ వెర్రిగుంటల వుద్దేశ్యం ? పొడుగుజుట్టూ, ఫ్రెంచిమీసాలూ, స్నోలూ, వొల్లెవాట్లూ, ఇవీ ఈనాటి పురుషలక్షణాలు. చొక్కాకింద వెమికలకుప్పలు. ఏదీ నీ చెయ్యి? చూడు, ఏ మూలన్నా, ఒక్క రవ్వ కండ.........

కుయ్యి మని చెయ్యి లాక్కున్నాను.

'ఏం చేస్తున్నావురా, ఇన్నేళ్ళూ? ఏమిటా పుస్తకం.... షా.....అంతే షాలూ, లారెన్సులూ చదువుతున్నావు. నీ బతుకంతా, మరి యీ పుస్తకాలతోనే వూరేగు, ఆడపిల్ల లెందుకురా నీకు ? ఏం చేసుకుంటావురా ? వాళ్ళనీ విప్పి చదువుకుంటావా ? ఏంచేస్తారు రాత్రంతా 'షా' చదువుకుని, స్త్రీలకి స్వతంత్రం లేదని తర్కిస్తారా ? ఈ సంఘాన్ని సంస్కారం ఎట్లా చెయ్యాలా, ఏ కాన్ఫరెన్సులు పెట్టాలా, ఏం లెక్చర్లియ్యాలా అని యోచిస్తారు తెల్లార్లూ-ఒకే పక్కమీద కూచుని. ఓరి జోగుల్లారా? ఎందుకురా స్వతంత్రం మీకు. ఓ మొగుడూ ఓ పెళ్ళాం చాలర్రా మీ బతుకులకి ?

ఆగాడు. చుట్టూ చూశాడు. ఎక్కడికన్నా పోదామని స్టేషను వొస్తుందేమోనని కిటికీలోంచి నేను చూస్తున్నాను. పోతే తంతానంటే......

'నీ యీడున్నప్పుడు ఇట్లా చూడు, నా జబ్బపట్టి చూడరా'

నాకు మొగవాళ్ళని తాకడం బావుండదు.

ఏం చెయ్యను ?

'ఇంకా వొత్తు-అంతేనా ?'

బిగ్గరగా నవ్వాడు.

'చూశావా ? నీ యీడున్నప్పుడూ, పరుగెత్తే దున్నపోతు తోక పట్టుకు వెనక్కి లాగితే, దున్నపోతు ఆగేదిరా. మరి నువ్వు ఎన్నడన్నా దణ్ణాలు తీశావా? చెడుగుడు ఆడావా? మరి ఏం చేస్తున్నావు ? ఓ మైలు పరుగెత్తుతావా ? పరీక్షలు పాసవుతున్నావు.Love letters వ్రాస్తున్నావు. రోడ్డుమీద ఆడపిల్ల కనపడితే వెంటపడతావు-మరి ఎవరన్నా తన్నవొస్తే పరుగెత్తగలవూ ? రాత్రిపూట మూడడుగుల గోడ దాటగలవురా ? ఇంకేం రొమాన్సురా? నీకు నీ మొహం.

అది మహారాష్ట్రదేశం గనక తెలుగు తెలీదు గనక సరిపోయింది.

తెలుగు రైలుపెట్టెలో అట్లా అరిచి ఆ మాటలంటోవుంటే నన్ను !......

'టెన్నిసన్ కవిత్వం. హానిబాల్ శౌర్యమూ, కృష్ణదేవరాయడి బలమూ, కాళిదాసు రఘువంశమూ, మీ కాలేజీ పార్లమెంటూ, స్వరాజ్యం-జపాన్ వాడితో నువ్వేరా పోట్లాడేది?'

ఆగి చూట్టూచూశాడు. వాళ్లెవళ్ళన్నా పోట్లాడగలరేమో అన్నట్టు

'ఇంత చాతకాని వాళ్లు గనుకనే కొత్త థియరీలు పెట్టారు-'

'చూస్తోనే వున్నానురా, నీ వ్రాతలూ- ఆధ్యాత్మిక ప్రేమలూ, ప్లేటోనిక్ లవ్‌లూ, మానసిక సానుభూతీ, పవిత్రతా, కళా వుపాసనా- మీ వ్రాతలట్లా వున్నాయి గనకనే మీ రాత లిట్లా యేడిశాయి-'

'వెంకటచలంగారు వాటిని వొప్పుకోరండి'

'నువ్వు వొప్పుకోవులే. కాని నువ్వుమాత్రం -విన్నావూ, ఆ షికార్లూనవ్వులూ, టీపార్టీ, బోట్లమీదా రైళ్ళమీదా గెంతడాలూ.....ఆడపిల్లల్ని రోడ్లమీద తిప్పడమెందుకురా ? అలిసిపోవాలనా ? అవునులే. అంతకన్న చాతకానప్పుడు ఏం చేస్తావులే ?

'ఒరే నామాటవిని ఆ కథలు మానెయ్యి ఎందుకురా నీ అనుభవాలూ నువ్వూను. నన్నెరుగుదువుగా !'

'అవన్నీ వూహించి వ్రాసినవండి. ఆయన అనుభవాలు కావు. అయెన్నెరుగుదును నేను'

'సరేలే ఎవరిముందున్నా బొంకుగాని, నా ముందుకాదు' నాకు తెలీనిదేమీలేదు. మహా మహావాళ్ళని చూశాను. ఏం తెలసురా నీకు ప్రేమంటే ? నీకేం తెలుసు ? నన్నడుగు చెపుతాను. ఎప్పుడన్నా మావూరు రా, నేను దాచిన వుత్తరాలు చూపుతాను. ఫోటోలూ వున్నాయిరా ? నేనే నా కథలు వ్రాస్తేనా ? ఇట్లాంటి ఆడవాళ్ళా ? ఇంతంత కళ్ళూ, ఇంత జుట్టు, ఇంతంత........'

వెళ్ళిపోతోంది ప్రవాహం. నుంచున్నాడు. ఆ జుట్టునీ కళ్ళనీ చేత్తో చూపుతో వర్ణిస్తున్నాడు. పెట్టెలోవాళ్ళు తెలుగువాళ్ళు హిందీఫిల్మ్ని చూసినట్టు చూసి ఆనందిస్తున్నారు. ఒకళ్ళిద్దరు లేచి ఆడడానికి సిద్ధమయ్యేటట్టున్నారు. 'పాటపాట' అంటారు కొంతసేపు పోతే. ఇదేం ఖర్మ నాది?

'మీరెవరో చెప్పారుకారు ?'

'నేనా !' కూచున్నాడు. 'నన్నెరుగవూ ?'

'ఎరగను'

'ఎరక్కేం. నేను యవ్వనంలోవుండగా ప్రతీ పత్రికలోనూ నా ఫోటో వెయ్యమని ఈ పత్రికల వాళ్ళని ఆశ్రయించే వాణ్ణా నీకు మల్లే! వాళ్లేనా గుమ్మముందు పడివుండే వాళ్ళు, ఏమనుకున్నావో ! విన్నావుగా? వజ్రేశ్వరశర్మ నా పేరు ?'

'మీరా అండి ! చిన్న కుర్రాణ్ణి నేను, మీరు మా కాలేజీలో డిమాన్‌స్ట్రేషన్ ఇచ్చి నప్పుడు.......'

నాకు జ్ఞాపక మొచ్చింది, ఆ పటం.

చెయ్యి కదిల్చినా, కాలు కదిల్చినా తాచుపాముల్లాగ పెనవేసుకునే నిగనిగలాడే కండలు తెల్లని చర్మంక్రింద వుబ్బి కళ్ళను చెదరగొట్టే బలం......

అంత 'రాట్' ఆయన మాట్లాడినా నాకు అద్భుతమైన అభిమానం కలిగింది. శరీర బలానికి ప్రజలుయిచ్చే అప్రయత్నమైన గౌరవం.

ఎరుగుదువుకద ! మా కాలంలో నా ఈ షికార్లూ ఈ కవిత్వాలూ ఏమీలేవు. ఒక్కచూపు, ఒక్కమాట-చాలు-ఈ టీలకు పిలవడాలూ, యీ పేర్లులేని చీట్లూ, యీ పుస్తకాల్లో పద్యాలకీ పెనసలుగీట్లూ, యీ గూఢకవిత్వాలూ, భావగీతాలూ, భావోద్రేక కథలూ, ప్రేయసులూ, హంసలూ, కోతులూ, కోయిలలూ,- ఏమీలేవు. అసలు మా పనేమిటో అది జాగ్రత్తపడేవాళ్ళం. కోయిలలూ మందమారుతాలూ వాటి జాగ్రత్త అవి పడేవి. వెతకడాలూ, చుంబనాలూ చాతకవు.

'ఎందుకురా వెధవ చదువులు ! పది గారెలు తినలేని, ఇద్దరు ఆడవాళ్ళకి జవాబు చెప్పలేని చదువులు ఎందుకురా అవి ? ఆ జాగ్రఫీల బదులు దేశమంతా తిప్పకూడదా? ఆ హిస్టరీ బదులు పాత నాణాలకోసం గోతులు తవ్విస్తే, వృక్షశాస్త్రం బదులు దున్నిస్తే, జంతుశాస్త్రం బదులు గాడిద లెక్కిస్తే, గంటకి యెన్ని దండాలు తియ్యగలరో ఆ లెక్కలు చెపితే బాగుపడతారు మీరు. బైరన్ చదివి, ఎంకిపాటలు పాడి 'షా'ని కోట్‌చేసి, కథలురాసి, ఆడపిల్లల్ని మరిగించి, తీరా భ్రమసి వొస్తే నువ్వు చేసే దేమిట్రా! ఒకటిన్నర తులం పాడు బిస్కటు ముక్కా, అరకప్పు టీ యిస్తావా వొయ్యారంగా ? తీరా సమయం వొచ్చేటప్పటికి మేమ్మెమ్మే అనడం-లేకపోతే ప్రేమమీద లెక్చరుకొట్టడం, తప్పించుకు పారిపోవడం. అయితే

యింకోకటిలే ఈనాటి ఆడపిల్లలూ అట్లానే వున్నారు. చప్పిదవడలూ, కాలికీ కంటికీ జోడూ, వొంగిన నడుములూ, పోచంటి చేతులూ- ఎందుకురా వాళ్ళూ.....అన్నీ వున్న పిల్ల ఒక్కతె కనపడదే, వొడ్డివాళ్ళల్లో తప్ప! సరిపోయినారులే ఒకరినొకరు!

'ఇదేనా షోలాపూరు.'

రైలు వేగం తగ్గించింది. ఆయనలేచి నలుగురిమీద నుంచి పెట్టా పక్కా సర్దుతున్నాడు. మాటలు మాత్రం ఆగలేదు.

'అయినా బొంబాయి ఎందుకు నువ్వు ? ఆంధ్రదేశం చాలలేదూ? విన్నాలే! ఆ మైసూరుపాకు సంగతి-ఏం?'

'ఏమిటది'

'తెలీనట్టు చూడకు. చేసి పైగా దొంగచూపులు పెడతావా ? ఆ వెధవ వేషమే మండుకొచ్చేది. మనలో మనకేం ? వొప్పుకో కూడదూ అంతమాత్రం? ఆ కాఫీహొటలు వాళ్లేమన్నారు ? చెప్పు, హ, హ హ 'ఆంధ్రదేశం చాలదా, మైసూరుమీద పడ్డాడా?' అన్నారటగా! భలేవాడివి.

'అదేదో వెంకటచలంగారేమో నాకు తెలీదు.'

'ఒరే, అబద్ధం చెబితే, 'జోక్' కాసేపు. పొద్దస్తమానం అదే మాటా? అందుకనే మండుకొస్తుంది. ఈ కుర్రాళ్ళతో మాట్లాడ్డం? పిరికి వెధవలు- నువ్వేదో నయమనుకున్నా, కథల్లో నీ డాబులు చూసి, అందరికన్నా- అన్యాయం నువ్వు. సరేలే, బొంబాయిలో జాగ్రత్త. తన్నులు తినేవు? మొగాళ్ళు కాదు ఆడవాళ్ళే తంతారు. ఆంధ్రులకు అపరిదిష్ట 'తేకు.'

రైలాగింది. సామాన్లు దించుకుంటున్నాడు. చప్పున ఏదో జ్ఞాపకం వొచ్చి తలుపు దగ్గిర్నించే 'ఒరేయ్' అన్నాడు.

ఆ అరుపుకి ముగ్గురు పోర్టర్లూ, ఒక గుమాస్తా, రెండు కుంటి కుక్కలూ ఆగాయి ఆ పెట్టె దగ్గిర.

'అయినా ఆ యూరేషియను పిల్లలతో నీకేం పనిరా? కంపుటగా వాళ్ళ దగ్గిర?'

'నాకేం తెలుసు?'

'ఇంత పిరికి వెధవ్వి అనుకోలేదు. ఎంత మోసపోయినాను!'

'నే నా వెంకటచలం కాదండీ.'

'కాదూ? ఎవరు నమ్ముతారు?'

మీరు నమ్ముతారా అన్నట్టు బండిలో వాళ్ళనీ, స్టేషన్‌లో వాళ్ళవంకా చూశాడు.

బండిసాగింది.

నేను నిట్టూర్పు విడిచి, ఆలోచిస్తున్నాను.

◆ ◆ ◆

*ప్రచురణ : (చలం కథలు 1వ సంపుటం) దేశీ ప్రచురణలు, 1956*